

# మంచు దుప్పటి

కొల్లాపూర్–పెద్ద కొత్తపల్లి రోడ్డును కమ్మేసిన మంచు

- రోడ్లను కమ్మేసిన హిమపాతం
- వాహనదారులకు ప్రాణసంకటం

కొల్లాపూర్, డిసెంబర్ 24 : నాగర్‌కర్నూల్ జిల్లాలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నది. చాలా ప్రాంతాల్లో ఉదయం 9 గంటల వరకు మంచు కమ్ముకుంటున్నది. పెద్దకొత్తపల్లి–కొల్లాపూర్ మధ్య ఆదివారం ఉదయం నుంచి 8గంటల వరకు రోడ్లను మంచుదుప్పటి కమ్మేసింది. దీంతో వాహనాదారులకు ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలకు లైట్లు వేసుకొని నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారం రోజులుగా సాయంత్రం నుంచే క్రమేణా చలివణికిస్తున్నది. దీంతో ప్రజలు ఉదయం 9 గంటలు దాటినా బయటికి రావడం లేదు.



వెల్దండ మండలం రాచూర్‌లో శాసనాలనుప రిశీలిస్తున్న పురావస్తుప రిశోధకుడుడా క్టర్ నాగిరెడ్డి

# ఆలయాలను కాపాడుకుందాం

- రాచూర్‌లో వెయ్యేండ్ల నాటి శిల్పాలు, శాసనాలు గుర్తింపు
- పురావస్తు పరిశోధకుడు డాక్టర్ నాగిరెడ్డి

వెల్దండ, డిసెంబర్ 24 : పురాతన ఆలయాలు, శిల్పాలు, శాసనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ నాగిరెడ్డి అన్నారు. వెల్దండ మండలం రాచూర్‌లో గ్రామస్తులు కోవూరి వెంకట్రావు, బెక్కిరి సురేశ్‌రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు పురావస్తు పరిశోధకుడు డాక్టర్ నాగిరెడ్డి ఆదివారం రాచూర్ గ్రామంలో హనుమాన్ శివాలయం, భైరవ, కేశవ, పోచమ్మ ఆలయాలను, శిల్పాలు, శాసనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. హనుమాన్ ఆలయం ముందున్న రాతి కలశం, ఆలయంలో పూడుకుపోయిన శాసనం, రంగులతో కళతప్పిన సప్తమాతల శిల్పం, శిథిల శివాలయంలో భిన్నమైన భైరవ విగ్రహం, పోచమ్మ గుడి వద్ద అమ్మవారు, భూమిలో కూరుకుపోయిన త్రికుటాలయం, కప్పురాలు, జారిపడిపోయిన శివాలయాలను పరిశీలించారు. శాసనాలను పరిశీలించిన ఆయన రాచూర్‌కు వెయ్యేళ్ల చరిత్ర ఉందని శాసనాలల్లో ఈ ఊరి పేరు రావితొర్రు, రావితోరుతి అని ఉందని తెలిపారు. చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన ఆలయాలు, శిల్పాలు, శాసనాలను పదిలపర్చి భావితరాలకు అందించాలని గ్రామస్తులను కోరారు.



సచివాలయంలోనీ టిపారుదలశా ఖఅధి కారులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# భూసేకరణను వేగవంతం చేయాలి

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, డిసెంబర్ 24 : కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ నిర్మిత ప్రాజెక్టుల కోసం భూసేకరణ పనుల్లో వేగం పెంచాలని, మైనర్ ఇరిగేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు నీటి పారుదలశాఖ, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్(తెలంగాణ సచివాలయం)లో కొల్లాపూర్ నియోజకవర్గంలో సాగునీటి పారుదలపై ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారులతో ఆదివారం మంత్రి జూపల్లి సమీక్ష నిర్వహించారు. ఎంజీకేఎల్ఐలో భాగంగా సింగవట్నం రిజర్వాయర్, జూరాల ఎడమ కాల్వ పరిధిలోని గోపల్‌దిన్నె జలాశయాన్ని కలిపే లింక్ కెనాల్ పనుల పురోగతి, భూసేకరణ లక్ష్యం ఏ మేరకు నెరవేరిందని అడిగి తెలుసుకున్నారు. సింగవట్నం రిజర్వాయర్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా కృష్ణానది నీటిని జూరాల ఎడమ కాల్వ పరిధిలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌ను నింపడం మూలంగా 35వేల ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో లింక్ కెనాల్ పనులకు రూపకల్పన చేశారు. అయితే ఈ పనుల నత్తనడకన కొనసాగుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. అయితే భూసేకరణలో జాప్యం కారణంగా పనులు ఆలస్యమవుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూసేకరణ సమస్యలపై నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు దృష్టి సారించి, పరిహారం సంగతి తేలితే పనులు వేగం అందుకునే అవకాశం ఉందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కెనాల్ తవ్వకాల మూలంగా భూములు కోల్పోతున్న వారంతా సన్న, చిన్నకారు రైతులేనని, వారికి సరియైన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే రూపొందించి, నివేదికను సమర్పించాలన్నారు. రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిపై తాను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతానని మంత్రి అధికారులకు వివరించారు. అలాగే 1500 ఎకరాల ఆయకట్టుకు నీరందించే ముక్కిడిగుండం సమీపంలోని జిల్దార్‌తిప్ప చెరువు పనుల ప్రగతిని గూర్చి మంత్రి ఆరా తీశారు. జిల్దార్‌తిప్ప చెరువు నింపడానికి ప్యాకేజీ–30తో పాటు పెద్దకొత్తపల్లి మండలం బాచారం, యాపట్ల, మారెడుమాన్‌దిన్నె, జిల్దార్ తిప్ప చెరువు ఆయకట్టుకు సాగునీరందించే పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత ఉన్న చోట చెరువుల ద్వారా పూర్తిస్థాయిలో డిస్ట్రిబ్యూటర్ కింద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సాగునీరందించాలని మంత్రి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో నీటి పారుదల ఎస్ఈ విజయభాస్కర్‌రెడ్డి, ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# నీటి విడుదలకు ముహూర్తం ఖరారు

- జనవరి 6నుంచి ఏప్రిల్ 25 వరకు యాసంగి నీటి విడుదల
- కోయిల్‌సాగర్ నుంచి ఒక్కో తడికి పది రోజుల చొప్పున సాగునీరు
- కుడికాల్వ కింద 9వేలు, ఎడమకాల్వ కింద 3 వేల ఎకరాలకు నీరు


దేవరకద్ర, డిసెంబర్ 24 : జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుంచి ఆయకట్టు రైతులకు యాసంగికి సాగు నీరు విడుదల చేసేందుకు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 32.6 అడుగులకు గానూ ప్రస్తుతం 31.8 అడుగుల నీరునిల్వ ఉన్నది. ప్రాజెక్టు పరిధిలో పాత ఆయకట్టు కింద 12వేల ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు అధికారుకు షెడ్యూల్ ఖరారు చేశారు. ప్రాజెక్టు కుడి కాల్వ కింద మరికల్, ధన్వాడ, చిన్నచింతకుంట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భూములకు సాగునీరు విడుదల చేశారు. అదేవిధంగా ఎడమ కాల్వ కింద దేవరకద్ర మండలంలోని 3వేల ఎకరాలకు సాగునీరు అందిస్తారు. అయితే ప్రతి తడికి పది రోజులు చొప్పున నీటిని విడుదల చేసి కొంత విరామం తర్వాత మరో తడికి నీటిని విడుదల చేయనున్నారు.

***నీటి విడుదల ఇలా..***

- ⇨ మొదటి తడి : జనవరి 6నుంచి 16 వరకు
- ⇨ రెండో తడి : ఫిబ్రవరి 3నుంచి 13 వరకు
- ⇨ మూడో తడి : ఫిబ్రవరి 25 నుంచి మార్చి 6వ తేదీ వరకు..
- ⇨ నాలుగో తడి : మార్చి 23 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు..
- ⇨ ఐదో తడి : ఏప్రిల్ 15 నుంచి 25వ తేదీ వరకు ప్రాజెక్టు పాత ఆయకట్టు కింద ఉన్న రైతులకు యాసంగిలో సాగు నీరు విడుదల చేస్తారు.

ఆయకట్టు రైతులు తడుల వారీగా వచ్చే సాగునీటిని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.

## ఐదు మెడికల్ కళాశాలలు మంజూరు..



మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల

గతంలో మెడికల్ కాలేజీలో చదవాలంటే ఎక్కడో హైదరాబాద్‌కు పోవాల్సిన పరిస్థితి వైద్య విద్యార్థులకు ఉండేది. గడిచిన పదేండ్లలో ఒక్క ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఐదు మెడికల్ కళాశాలలను కేసీఆర్ సర్కార్ ఏర్పాటు చేసింది. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ 2018లో అందుబాటులో రాగా నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని కళాశాలలు 2022లో అందుబాటులోకి వచ్చాయి. గద్వాల, నారాయణపేట జిల్లాలోని మెడికల్ కళాశాలల పనులు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఆయా జిల్లా కేంద్రాల్లోని అందుకొనే అవకాశం ఉంది. రూ.1500 కోట్లతో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. దీంతోపాటు నర్సింగ్, డిగ్రీ, జూనియర్ కాలేజీలు, గురుకుల పాఠశాలలను కూడా నెలకొల్పి విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసింది. గతంలో ప్రైవేటు విద్యకే మొగ్గుచూపే విద్యార్థులు ఈరోజు ప్రభుత్వ పాఠశాలల్లో పోటీపడి చదువుతున్నారు. అడ్మిషన్లు ఫుల్, హై రెకమండేషన్లు, అదనపు కాలేజీలను సీట్లను నెలకొల్పే పరిస్థితికి వచ్చింది.



నార్లాపూర్ వద్ద సిస్టర్న్ నుంచి ఎగిసిపడుతున్న కృష్ణాజలాలు (ఫైల్)

# స్వేద పత్రంలో.. పాలమూరు

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.40 వేల కోట్లతో సంపద సృష్టి
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ముందంజ..
- 90 శాతం పూర్తయిన పీఆర్‌ఎల్ఐ
- రూ.3 వేల కోట్లతో రన్నింగ్‌లో పెండింగ్ ప్రాజెక్టులు
- 2014లో ఆరు లక్షల ఎకరాలు దాటని సాగు.. నేడు డబుల్
- వలసల జిల్లా పేరు చెరిపేసిన కేసీఆర్ పాలన
- ఐదు జిల్లాల్లో మెడికోలాహలం
- సుమారు రూ.2 వేల కోట్లతో ఇంటింటికీ తాగునీరు
- మరో రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పరుగులు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వలసలు.. ఆకలి చావులు.. సాగు తాగునీటి కోసం గోసపడ్డ పాలమూరు ఇవాళ సగర్వంగా తలెత్తుకుంటున్నది.. వలసల జిల్లా రూపు పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు పొట్టకూటి కోసం వలసలు వెళ్లే పాలమూరు జిల్లాకు ఇవాళ ఇతర రాష్ట్రాల నుంచి వలసలు వచ్చే పరిస్థితి నెలకొంది.. 2014లో పాలమూరు ఎంపీగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయ్యాక పాలమూరు జిల్లా రూపురేఖలే మారిపోయాయి.. గడిచిన పదేండ్లలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు రూ.40,000 కోట్లతో అభివృద్ధిని పరుగులు పెట్టించి.. కోట్లాది రూపాయల సంపదను సృష్టించారు.. నీటి పారుదల, విద్య, వైద్య, ఆరోగ్యరంగాలతోపాటు పల్లెలు, పట్టణాల రూపురేఖలు మారడంతో పదేండ్లలో ఉమ్మడి జిల్లా స్వరూపమే మారిపోయింది. ఉమ్మడి జిల్లాలో 2014లో ఆరు లక్షల ఎకరాలకు మించని సాగు భూములు, ఇవాళ 14 లక్షలకు పెరిగింది. వృథాగా పోతున్న కృష్ణ, తుంగభద్ర, భీమా నదీ జలాలు తరలించి బీడు భూములను సస్యశ్యామలం చేశారు. ఉమ్మడి జిల్లాలోని అనేక వాగులు వంకలపై చెక్ డ్యాములు నిర్మించి ఎక్కడికక్కడే నీటిని ఒడిసిపట్టారు. దీంతో భూగర్భ జలాలు కనివినీ ఎరుగని రీతిలో పెరిగిపోవడంతో ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం పండుతోంది. ఐదు జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లు, మెడికల్ కళాశాలలు నిర్మించి విద్య, వైద్య రంగాలను ఎంతో అభివృద్ధి చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వాసుల కళాయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కూడా పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ నాటికి దశలవారీగా సాగు నీరు ఇచ్చే విధంగా ప్లాన్ చేశారు. మిషన్ భగీరథ పథకం కింద ప్రతి పల్లెకు తాగునీరు అందిస్తున్నారు. చిన్న జిల్లాల ఏర్పాటుతో పరిపాలన సౌలభ్యంతోపాటు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పరుగులు పెట్టించారు. రైతులు, ప్రజలకు 24గంటలు నాణ్యమైన కరెంటు ఉచితంగా అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయక వాటిని ఇతరుల మీద నెట్టే ప్రయత్నం ప్రారంభించింది. అప్పులు కుప్పలు తెప్పలు అంటూ అబద్ధాల ప్రచారం చేస్తున్నది. దీంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో స్వేదపత్రం విడుదల చేశారు. ఈ పదేండ్లలో తెలంగాణ సాధించిన అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

***రూ.పదివేల కోట్లతో అభివృద్ధి పరుగులు..***

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పదేండ్లలో సుమారు రూ.10వేల కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. జిల్లా కేంద్రాల్లో సమీకృత కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు, సామూహిక మార్కెట్లు, రహదారులు, పాఠశాలలు, కళాశాలలు ఇతర భవనాలు, పట్టణ ప్రగతి, పల్లెప్రగతి కింద రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించింది. మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి వసతి కోసం పెద్ద ఎత్తున సంప్‌హౌస్‌లు, ట్యాంకులు, కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు వేశారు. మిషన్ కాకతీయ పథకం కింద సుమారు 1500కు పైగా చెరువులను రూ.వెయ్యి కోట్లతో బాగు చేశారు. అదనంగా లక్ష ఎకరాల దాకా చెరువుల కింద సాగయ్యే విధంగా చేశారు. పట్టణాల్లో చెరువులను సుందరీకరించి ట్యాంక్ బండ్‌గా మార్చారు. జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో రూ.వందల కోట్లతో ఆహ్లాదకరంగా పార్కులను ఏర్పాటు చేశారు. అచ్చంపేటలో పర్యాటకుల కోసం జంగిల్ సఫారీ.. మహబూబ్‌నగర్‌లోని అర్బన్ జంగల్ సఫారీ ఆకట్టుకుంటున్నది. 2వేల ఎకరాల్లో కేసీఆర్ అర్బన్ పార్కు ఏర్పాటుతో హైదరాబాద్‌కి వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే పర్యాటకులతో సందడిగా మారింది. ఉమ్మడి జిల్లాలో మండలాలకు డబుల్ రోడ్లు, గ్రామాలకు సింగిల్ లైన్ బీటీ రోడ్లు, పల్లెల్లో సీసీ రోడ్లు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, మన ఊరు–మన బడి కింద పాఠశాలల రూపురేఖలు మార్చడంతోపాటు కొత్తగా దేవరకద్ర–కృష్ణ రైల్వే లైన్, మహబూబ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వరకు రైల్వే డబ్లింగ్, విద్యుత్ లైన్ ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి సంపద సృష్టించింది కేసీఆర్ సర్కార్. మహబూబ్‌నగర్‌లో రూ.50 కోట్లతో హరిత హోటల్, మన్యంకొండలో రూ.40 కోట్లతో రోప్‌వే, రూ.25 కోట్లతో కురుమూర్తి ఆలయ అభివృద్ధితోపాటు ఉమ్మడి జిల్లాలోని గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలో కనీవినీ ఎరుగని అభివృద్ధి కండ్లకు కనిపిస్తోంది. వీటన్నింటినీ వదిలేసి కాంగ్రెస్ పార్టీ కేవలం కావాలని అప్పుల పాలైనట్టు దుష్ప్రచారం మొదలు పెట్టింది. ఉమ్మడి పాలమూరు జిల్లా అనేక రంగాల్లో అభివృద్ధి సాధించినా కూడా రేవంత్ ప్రభుత్వం అబద్ధాలు ప్రచారం చేస్తే సొంత జిల్లాకే వెన్నుపోటు పొడిచిన వాళ్లు అవుతారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

## పాలమూరు-రంగారెడ్డికి రూ.26 వేల కోట్లు..

ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ. 26,738 కోట్లు ఖర్చు చేసింది. కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్లాపూర్ వద్ద కృష్ణానది జలాలను ఎత్తిపోసి ఐదు రిజర్వాయర్లను ఏర్పాటు చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వికారాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. 2015 జూన్ 11న కేసీఆర్ సర్కార్ మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కరివెన వద్ద ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తి కాకుండా విపక్షాలు అనేక అడ్డంకులు సృష్టించాయి. కేంద్రం కృష్ణా జలాల వాటాను తేల్చకున్నా కేసీఆర్ సర్కార్ ఇప్పటివరకు తొంబై శాతం పనులను పూర్తి చేసింది. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను నిర్మించి సుమారు 70 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసింది. ఒక్క ఉదండాపూర్ రిజర్వాయర్ తప్పా మిగతా పనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. 2014ముందు ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పథకాలను కూడా రూ. మూడు వేల కోట్లతో పూర్తిచేసి అదనంగా సాగు విస్తీర్ణం పెంచింది. 2014లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం కేవలం ఆరు లక్షల ఎకరాలు ఉండగా 2023 నాటికి 14 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. అంతేకాకుండా మరో రూ.వెయ్యి కోట్లతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక వాగులు, వంకలపై చెక్ డ్యాంలు కట్టి ఎక్కడికక్కడే నీటిని ఒడిసిపట్టింది.



మహబూబ్‌నగర్ న్యూగంజ్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగాన్ని టీవీలో వీక్షిస్తున్న ప్రజలు

## వలసలు వాపస్..

పాలమూరు జిల్లా అంటే ఒకప్పుడు వలసలకు ప్రసిద్ధి. తెలంగాణ రాకముందు ఏటా 14 లక్షల మంది మహానగరాలకు వలస పోయేవాళ్లు. ఎన్నో కుటుంబాలు ఇతర ప్రాంతాల్లో స్థిరనివాసాలు ఏర్పరచుకున్నారు. పుట్టిన ఊరు వదిలిపెట్టి ఎంతోమంది పొట్టచేత పట్టుకొని వలసలు పోయారు. ఇక్కడ పనిలేక పొలాలకు సాగునీరు లేక.. తాగడానికి గుక్కెడు మంచినీరు లేక అనేక గోసపడ్డారు. కానీ ఇవాళ తెలంగాణ వచ్చాక కేసీఆర్ సర్కార్ హయాంలో పాలమూరు రూపురేఖలే మారిపోయాయి. పెండింగ్ ప్రాజెక్టులన్నీ రన్నింగ్ ప్రాజెక్టులు కావడం, సుమారు రూ.2000 కోట్లతో మిషన్ భగీరథ పథకాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశపెట్టి నిత్యం మంచినీళ్లు అందిస్తున్నది. సాగునీటికి తాగునీటికీ ఢోకా లేకపోవడంతో పల్లెటూర్లు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. దీంతో వలస వెళ్లిన వారంతా వాపస్ వచ్చి పొలాలను సాగు చేసుకుంటుండడంతో పచ్చదనం పరిడవిల్లింది. ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలే పాలమూరు జిల్లాకు వలసలు వస్తున్నారంటే ఎంత మార్పు జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నాడూ రూ.మూడు లక్షల ధర పలకని భూములు నేడు రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు ఎకరా లభించే పరిస్థితి ఏర్పడింది. 55 ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ పాలమూరును ఏ మేర అభివృద్ధి ఏం చేసిందో.. ఈ పదేండ్లలో కేసీఆర్ సర్కార్ చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలు అర్థం చేసుకోవాలి.



## క్రిస్మస్ తాత..

క్రిస్మస్ రోజున చిన్నారులతో క్రిస్మస్ తాత వచ్చి సరదాగా ఆడుకుంటాడు. బొమ్మలు, చాక్లెట్లు ఇస్తాడని చిన్నారులు అతడి కోసం ఆశగా ఎదురుచూస్తుంటారు. క్రిస్మస్ తాత అంటే నికోలస్ అనే వ్యక్తి తల్లిదండ్రుల మరణాంతరం వారు సంపాదించిన ఆస్తులను పేదలకు పంచిపెట్టడానికి నిర్ణయించుకుంటాడు. తాను ఎవరో తెలియకుండా ఉండేందుకు బహుమతులు పంచే సమయంలో ఎర్రటి దుస్తులు, గుర్తు పట్టకుండా తెల్లటి గడ్డం, టోపీని ధరించాడు. అతడే శాంటక్లాజ్.. క్రిస్మస్ తాత.



విద్యుద్దీప కాంతుల్లో జడ్చర్ల బేతని ఎంబీ చర్చి

- క్రీస్తు జన్మదినాన్ని ఘనంగా జరుపుకోనున్న క్రైస్తవులు
- వేడుకలకు ముస్తాబైన చర్చిలు

# నేడు క్రిస్మస్



గద్వాలటౌన్, డిసెంబర్ 24 : క్రిస్మస్.. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనే పర్వదినం. సోమవారం క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా అంతటా రెండు రోజుల ముందే పండుగ సందడి నెలకొన్నది. చర్చిలతోపాటు క్రైస్తవుల ఇండ్ల వద్ద క్రీస్తు జననానికి గుర్తుగా నక్షత్రాలను, క్రిస్మస్ ట్రీలను అందంగా అలంకరించారు. అలాగే జిల్లాలోని చర్చిలన్నింటినీ విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆయా చర్చిల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

***క్రిస్మస్ స్టార్..***

క్రిస్మస్‌కు ముందు నుంచే క్రైస్తవులు తమ ఇండ్లపై నక్షత్ర ఆకృతులను అలంకరించుకుంటారు. క్రీస్తు జననానికి చిహ్నంగా నక్షత్ర ఆకృతిని భావిస్తారు. తూర్పు దేశాల జ్ఞానులకు గొల్లలకు దారి చూపిన దివ్య నక్షత్రాన్ని క్రీస్తు జయంతికి ప్రత్యేక చిహ్నంగా క్రైస్తవులు భావిస్తారు. నాటినుంచి నేటి వరకు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రిస్మస్ స్టార్‌ను ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అదేవిధంగా క్రిస్మస్ ట్రీని అందంగా అలంకరిస్తారు. క్రిస్మస్ చెట్టును ప్యారడైజ్ ట్రీగా కూడా పిలుస్తారు. నిత్యం పచ్చగా ఉంటూ ప్రజలకు సుఖసంతోషాలను ట్రీ పంచుతుందని క్రైస్తవులు నమ్ముతారు.

***కొవ్వొత్తుల ప్రదర్శన..***

క్రిస్మస్‌కు ముందు రోజు క్రైస్తవులు యేసుక్రీస్తును స్తుతిస్తూ అర్ధరాత్రి వరకు జాగరణ పాటిస్తారు. అంధకారంలో ఉన్న ప్రపంచాన్ని వెలుగులతో నింపడానికి క్రీస్తు మర లా జన్మిస్తున్నారని చాటి చెప్తూ చర్చిల్లో, ఇండ్లల్లో కొవ్వొత్తులను వెలిగిస్తారు. నక్షత్ర రూపాల్లో ఉన్న సెట్టింగ్‌లు ఇండ్లపై ఎగురవేసిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

## వేడుకలకు సర్వం సిద్ధం..

తాగ్యశీలి.. కరుణామయుడు అయిన క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకొనేందుకు సర్వం సిద్ధమయ్యింది. చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక ప్రార్థనలు జరుపుకొనేందుకు వీలుగా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.